


గురునాథం వొక గవర్నమెంటు కాలేజీలో గుమాస్తా. అటుపై ఆ ఆఫీసులో పెద్దల్తోనూ, యిటు వచ్చిన ప్రతి ప్రిన్సిపాల్‌తోనూ అతను తలలోనాలికలా వుంటుంటాడు. పైగా అతనికి రూల్సు అన్నీ కంఠోపాఠం అంచేత పేరుకు గుమాస్తాయే అయినా అతను ఆ కాలేజీకి మకుటంలేని మహారాజు.

గుర్నాధం అన్నీ రూల్సు ప్రకారమే చేస్తానంటాడు. చేస్తున్నట్లు

# మూడు స్తంభాలాట



నటిస్తాడు. కానీ ఏరూలును ఎక్కడ మడత వేయాలో, ఎలా వంకర్లు తిప్పాలో, ఎప్పుడు పరుగెత్తించాలో, ఎప్పుడు పడుకోబెట్టాలో, కుంటించాలో .... యిలాంటివన్నీ కాచి వడబోసి కషాయంచేసి పెన్నులో యింకుగా వాడుకుంటున్నాడు. ఆ యింకుతో ప్రభుత్వంవారి దస్త్రాల దస్త్రాల కాగితాలను ఖరాబుచేయడం అతనికున్న అనేక సర్దాల్లో గొప్ప సర్దా. అయితే అతని చేతుల్లోనుంచి 'టీ. పి.' రావాలన్నా 'మంత్ర పుష్పం' సమర్పించక తప్పదు.

అందంగా, నాజూగ్గా వుండే గుమ్నాధం బుద్ధి యిలా ఎప్పుడూ అష్టవంకర్లు తిరుగుతూ వుంటుంది.

కప్పగంతుల మల్లికార్జునరావు

యవ్వనంలో వున్నా అతని ఆలోచనలకు ఎప్పుడూ వృద్ధాప్యమే.

కాలేజీ మాస్టర్లతో మంచిగా మాట్లాడుతూనే వాళ్ళను గ్రూపులు గ్రూపులుగా చీలుస్తాడు. పిల్లల్ని రెచ్చగొట్టి మాస్టర్లమీద పిటీషన్లు పెట్టిస్తాడు. మాస్టర్లనీ, పిల్లల్నీ కూడా కూడగట్టి ప్రిన్సిపాలుకు విరుద్ధంగా సమ్మెలు చేయించగలడు. అందుకే అతనంటే అందరికీ భయం.

ఇలా ఎన్నాళ్ళగానో వెలిగిపోతున్న గుర్నాధం ప్రతిభ కొత్త ప్రిన్సిపాల్ రావటంతో ఒక్కసారిగా కొడిగట్టింది.

ఆ ప్రిన్సిపాల్‌కు 'చండ శాసనుడు' అన్న పేరుంది. అతనికి రూల్సులన్నీ తెలుసు. దేనికీ గుమాస్తాల మీద ఆధారపడడు. అవసరమైతే గుమాస్తా సీటుకెళ్ళి ఫైలు తీసుకొని రాసి పారేయగల సత్తా వున్నవాడు. అన్నిపనులూ టంచన్‌గా జరగాలంటాడు 'డిసిప్లైన్' ఆయన వూపిరి.

గుర్నాధానికి కొత్త ప్రిన్సిపాల్ సంగతి తెలుసు. అందుకే ఆయన వచ్చిన వారం రోజులుగా దొరికిపోయే పనులేం చేయకుండా జాగ్రత్త పడ్తున్నాడు.

కానీ సరిగ్గా అదే సమయంలో గుర్నాధం చెల్లెలి పెళ్ళి నిశ్చయం కావటంతో అతనికి పెద్ద చిక్కు వచ్చి పడింది. సంవత్సరాంతం కావటంవల్ల సెలవులేం మిగిలి లేవు. కాలేజీకి వెళ్ళినట్లు వెళ్ళి యింటి పనులు చూసుకోటానికి ప్రిన్సిపాల్ అంగీకరించడు. అంచేత అయినవాళ్ళ యిళ్ళల్లో ఏ పెళ్ళి జరిగినా పనులన్నీ నెత్తినేసుకొని తిరిగే గుర్నాధం, తన చెల్లెలు పెళ్ళికి మాత్రం ఏ బాధ్యతలు తీసుకోలేక పోయాడు. కానీ వొక్క బాధ్యత మాత్రం తీసుకోక తప్పలేదు.

తాలూకా ఆఫీసునుంచి చక్కెర ఇత్యాది రేషన్ వస్తువులకు పర్మిట్లు తీసుకొచ్చే సత్తా గుర్నాధానికి తప్ప ఆ కుటుంబంలో మరెవరికీ లేదు మరి!

మొన్న మధ్యాహ్నం వెళితే పర్మిట్ల గుమాస్తా లంచ్ కెళ్ళేడన్నారు. నిన్న సాయంకాలం వెళ్తే గుమాస్తా సీటు ఖాళీగా వుంది. ఎనిమిదింటి దాకా ఎదురుచూచినా చిరునామా చెప్పే నాథుడే దొరకలేదు.

ఇంట్లో నలుగురూ నానా దెప్పి పొళ్ళు పొడుస్తుంటే యివాళ ఎలాగైనా పర్మిట్ల గుమాస్తాను పట్టుకోవాలని వోగంట లేటుగా రావటానికి పర్మిషన్ పెట్టేడు. పదింటికే

భోజనం ముగించుకొని తాలూకా ఆఫీసుకు బయల్దేరేడు గుర్నాధం।

* * *

తాలూకా ఆఫీసులో పర్మిట్ల గుమాస్తా శేషగిరి రావు మరో రెండేళ్ళలో సర్వీసునుంచి రిటైరు కావటానికి సిద్ధంగా వున్నాడు. చేస్తున్నది చిన్న గుమాస్తా వుద్యోగమే అయినా గంపెడంత సంసారాన్ని గుర్రబ్బండిలా హాయిగా పరుగెత్తించుకొచ్చాడు. ముగ్గురు

# హాస్య కథ

కూతుళ్ళకు మంచి మొగుళ్ళను, కొడుకులకి సీట్లను, ఉద్యోగాలను, నలుగురి మీదా నాలుగు పైసలు ఎక్కువిచ్చే కొన్నాడు. అయిన వాళ్ళందరిలో ప్రయోజకుడని, ప్రజ్ఞాశాలి అని అనిపించుకున్నాడు.

అయితే డిపార్టుమెంటులో మాత్రం ఆయనకి మంచిపేరు లేదు. 'బకాసురుడు' అని రెవిన్యూ డిపార్టుమెంటులో కిందినుంచి పైదాకా ఆయన్ని వ్యవహరిస్తుంటారు. రెవెన్యూలో యితరుల ఆకలికి యీ బకాసురుడి ఆకలికి పెద్ద భేదం వుంది. అదేమిటంటే యితరుల ఆకలి కాస్త తిన్నాక ఆరోజుకైనా ఆరుతుంది. కాని శేషగిరిరావుకు తినేకొద్దీ ఆకలి ఎక్కువవుతుంది. పైగా తినేది అన్నమా, గడ్డా అనే ఆలోచన కూడా లేదు. కన్పించిన దల్లా పీక్కొని నోట్లో కుక్కోసుకోటమే।

ఆయన ఆకలి దెబ్బకు తట్టుకోలేక పైవాళ్ళు యిన్నాళ్ళు అతని చేత అరణ్యవాసాలు, అజ్ఞాతవాసాలు చేయించారు. అయినా శేషగిరి ఆకలి పెరిగిందే కాని ఏ మాత్రం తగ్గలేదు.

అతని పద్ధతుల్తో విసుగేసిన పై ఆఫీసర్లు అతని కాన్ఫిడెన్షియల్ రిపోర్టులలో భూతాల బొమ్మల్ని పెయింట్ చేసి పోయారు. ఫలితంగా అతని జూనియర్లంతా మెట్లెక్కిపోతున్నా శేషగిరి మాత్రం కింద

మెట్టుదగ్గకే నిలబడ్డాడు. అయితే శేషగిరికి ఆ విచారం యిసుమంతైనా లేదు. అతను పై మెట్లవైపు ఎన్నడూ చూస్తేనా? పక్కచూపులే!

ఇప్పుడు శేషగిరి బాస్ లందరూ ఎక్కడోక్కడ అతనితో పనిచేసిన వారే. అందులో చాలామందికి అతనంటే అసహ్యం. కొద్దిమందికి మాత్రం సానుభూతి!

అలా సానుభూతి వున్న వో ఆఫీసర్ పుణ్యాన శేషగిరి పన్నెండేళ్ళ వనవాసానికి స్వస్తి చెప్పి రిటైరు కాటోయే ముందు స్వస్థలానికి చేరుకున్నాడు. పర్మిట్ల సీటులో పీఠం వేశాడు.

అన్ని కోరికలు తీరినా శేషగిరికి ఒక్క కోరిక మాత్రం తీర్చుకొనే అ వ కా శ ం చి క్క లే దు. స్వగ్రామంలో 'డీసెంట్' యిల్లు కట్టుకోటం—ఆ కోరిక. తాలూకా ఆఫీసులో గుమాస్తాగా వుండగానే ఇల్లు కట్టకోటంలో వున్న లాభాలు అతనికి తెల్సు. అంచేత రిటైరయ్యేలోగా గృహ ప్రవేశం ఘనంగా చేయాలని అతని ఆరాటం.

యజ్ఞంలా ప్రారంభించాడు. ప్రణాళిక వేశాడు. స ం భా రా లు సమకూర్చుకొన్నాడు. మ్యునిసిపాలిటీకి ప్లాన్ సమర్పించాడు. అది కాస్తా అప్రూవ్ అయితే యిక యజ్ఞ దీక్ష స్వీకరించినట్లే!

అదుగో—ఆదశలోనే ఆయన ప్రణాళికకు బ్రేకుపడింది. ప్లాను గుమాస్తా టేబిల్‌నుంచి కదలనని మొరాయించింది. ఎందరిచేతో యిన్‌ఫ్లుయెన్స్ చేయించాడు. కమీషనర్ యింజనీర్‌ని. యింజనీర్ టౌన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్‌ని. ఆ యినస్పెక్టరు గుమాస్తాను అడగమన్నారు.

గుమాస్తాకోసం కాలుకు బలపాలు కట్టుకు తిరుగుతున్నాడు. ఒకసారి సీటులో వుండదు. మరోసారి ఎవర్తోనో సీ రి య స్ గా మాట్లాడుతుంటుంది. ఇంకోసారి ఫైల్లో పత్రికలుపెట్టి దీక్షగా చదువుతుంటుంది. మాట్లాడిస్తే నవ్వుతుంది. విషయం కదిలిస్తే క్లుప్తంగా సమాధానాలు చెప్తుంది. పనిచెయ్యననదు. చేస్తాననదు. చెయ్యదు. వాయిదా లేస్తూనే వుంది.

ఆ గుమాస్తా ధోరణి సీనియర్ గుమాస్తా శేషగిరిరావుకు కొత్తేం కాదు. అవన్నీ అతను ఆచరించేవే.

'మంత్ర పుష్పం' సమర్పించుకోటానికి అతనూ సి ద్ధ ం గా నే వున్నాడు. అయితే దానికీ కొన్ని పద్ధతులున్నాయి. ఆ పద్ధతుల్లోకి రావటంలేదు గుమాస్తా. వాతావరణం ఎస్టాబ్లిష్ అయి పాత్ర స్వరూప

స్వభావాలు ఎష్టాబ్లిష్‌కాని సినిమా సన్నివేశంలా తయారయింది శేషగిరి పరిస్థితి!

'ఎలాగైనా సరే, యివాళతాడో పేడో తేల్చి పైలు కదల్చాలి' అని నిర్ణయం తీసుకొని శేషగిరి ఆఫీసుకు పదింటికే వచ్చి అటెండెన్సు రిజిస్టరులో సంతకం పొడిచాడు. 'ఎవరైనా అడిగితే ఇప్పుడేవస్తాడని చెప్పు' అని పక్క గుమాస్తాతో చెప్పి హుటాహుటిగా సైకిల్ స్టాండు దగ్గరి కెళ్ళేడు.

సరిగ్గా అదే సమయంలో గుర్నాథం సైకిలు దిగి చెమటలు కక్కుకుంటూ స్టాండ్ వేసి తాళం బిగిస్తున్నాడు. 'యివాళైనా ఆ గుమాస్తాగారు దొరుకుతారో దొరకరో!' అనుకుంటూ లోపలికి నడిచాడు.

శేషగిరి సైకిలు తీసుకొని వాకిట్లోకి చూచి ఎవరో ముత్తయిదువ వస్తుంటే 'శకునం బాగుంది. ఇవాళ పనైనట్లే' అనుకొంటూ హుషారుగా సైకిలెక్కేడు!

* * *

మ్యునిసిపల్ ఆఫీసులో బిల్డింగ్ సెక్షన్‌లో ప్లాను ఎంక్రోచ్‌మెంట్లు యిత్యాది విషయాలుచూచే గుమాస్తా పేరు హైమావతి. ఆమె తాత వొకప్పుడు ఆపూరికి ఛైర్‌మన్. తండ్రి ఆ మునిసిపాలిటీలోనే మేనేజర్‌గా పని చేసి రిటైరయ్యాడు. ఆయన ది మొదటినుంచీఆధ్యాత్మికదృక్పథం. మేనేజర్ అయినా ఛైర్మెన్ పోకడలు పోయేవాడు. ఫలితంగా వుద్యోగంలో ఎలా చేరాడో అలాగే రిటైరయ్యాడు.

రిటైరయ్యే ముందు ఆయన చేసిన ఒకే ఒక్క మంచి పని కూతురుకు గుమాస్తా వుద్యోగం యిప్పించుకోటం.

హైమావతినగటు ఆడపిల్లల్లాంటిది. సాధారణమైన అందం. గుమాస్తా చదువు, సంసారపక్షమైన కోరికలు, ఆలోచనలు....

ఆమెకు పెళ్ళిచేసుకొని అందరు ఆడాళ్ళలాగే పిల్లల్ని కని సుఖంగా సంసారం చేసుకోవాలన్న కోరిక తప్ప, వూళ్ళేలాలని, వూరేగాలన్న ఆలోచనలే లేవు. అయితే ఆ సింపిల్ కోరిక తీరే మార్గమే ఆమెకు కన్పించలేదు.

పెళ్ళిచూపులకంటూ వచ్చిన పెద్దలు కొందరు ఆమెకు లేని వంకర్లు పెట్టె, మరికొందరు లేని వాటిని వుంచే బాగుండేదని కామెంట్ చేసేరు. అందరూ 'కట్నాలు....కట్నాలు' అంటూ కాకుల్లా అరుచుకొంటూపోయారు ఆఖరికి.

చూచి చూచి విసిగిపోయి హైమవతి వో నిర్ణయానికొచ్చింది. తన పెళ్ళి తను చేసుకోవాలి. తండ్రి మీద ఆధారపడి లాభంలేదు.

చుట్టూ లోకాన్ని, పరిస్థితుల్ని చూచి పద్ధతి మార్చింది. ఫేషన్లు, స్టయిల్స్, లేనిపోని వగలు పోవటం, సౌకుమార్యాన్ని ప్రదర్శించటం.... యీ ఆయుధాల్ని ధరించి స్వయంగా మొగుడికోసం వేటాడసాగింది.

ఎందరో ఆమెవెంట పడ్డారు. మిథ్యా ప్రేమలను ప్రదర్శించారు. పెళ్ళనేసరికి కొందరు, కట్నాలు లేవనేసరికి అందరూ జారుకొన్నారు. ముందుకొచ్చి నిల్చింది గుర్నాధం వొక్కడే!

సంఘ సంస్కరణ, ఆదర్శం, ఆశయం—యిత్యాది మాటలకే గుర్నాధం విరోధి. కేవలం వ్యాపారపు దృక్పథంతోనే అతను హైమావతిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకోటానికి సిద్ధపడ్డాడు.

కట్నం పుచ్చుకొంటే కుటుంబ ఖాతాలో జమ అవుతుంది.

ఉద్యోగం చేసే పెళ్ళామయితే 'రికరింగ్ డిపాజిట్'. అందులోనూ మ్యునిసిపాలిటీలో వుద్యోగి భార్య అయితే పెట్టుబడి లేకుండా పెద్ద బిజినెస్ చేసుకోవచ్చు.

"నీకు ఉద్యోగం ప్రధానమా? నేను ప్రధానమా హైమా?"

కట్నం లేకుండా అందగాడు, వుద్యోగస్తుడు అయిన అతను తనని పెళ్ళి చేసుకోటానికి సిద్ధపడ్డక్షణంలోనే హైమావతిదృష్టిలో గుర్నాధం అపర వీరేశలింగం పంతులయ్యాడు. విపరీతమైన గౌరవంతో.

"నువ్వే నాథా! నువ్వు నా జీవితం. నీ కోసం ఏం చేయమన్నా సిద్ధమే: తలిదండ్రుల్ని, ఉద్యోగాన్ని దేన్నైనా వదులుకోటానికి సిద్ధంగా వున్నాను."

"ఆ మాటచాలు. కాని నువ్వు ఉద్యోగం చేస్తూ ఆ కుర్చీలో కూర్చోవాలి. కాని ఫైళ్ళుమాత్రం నేను చెప్పందే కదిలించకూడదు. ఆఫీసులో పత్రికలు, నవలలు చదువుకో. రాత్రిళ్ళు యింట్లో నేను ఫైలులో ఏం రాయాలో 'డిక్టేట్' చెస్తా. అండర్ స్టేండ్?"

'అండర్ స్టేండ్.' అయితే అలాంటి అవినీతి పనులకు ఆ కుటుంబమే దూరం. అంచేత కాస్తంత ఆలోచించింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? యీ కండీషన్‌కు నువ్వు అంగీకరించటమే నీనుంచి నేను ఆశించే కట్నం. లేకపోతే పెళ్ళి కాదు మరి!"

హైమావతికి పెళ్ళి ముఖ్యం. అందుకోసం ఏదైనా త్యాగం చెయ్యటానికి సిద్ధమే!

"గుడ్. నువ్వు నైస్ గరల్‌వి. సో - యివాళే మనం తాంబూలాలు పుచ్చుకొన్నట్లు లెక్క. మా చెల్లెలి పెళ్ళికాగానే మన పెళ్ళి. అయితే మన యీ వప్పందం రేపటినుంచే అమలులోకి వస్తుంది."

అప్పటి నుంచి హైమావతి పెళ్ళను గురించి పట్టించుకోటం మానేసి, పెళ్ళిని గురించి, పిల్లల్ని గురించి కలలు కనసాగింది. మధ్య మధ్య పత్రికలు, నవలలు చదివి సేద తీర్చుకొనేది.

ఇప్పుడు హైమావతి వద్దనున్న పైలుకు ప్రాణ ప్రతిష్ట జరగాలంటే గుర్నాధం గ్రీన్ సిగ్నల్ యివ్వాలి. ఆ సిగ్నల్ రాకే శేషగిరి పైలు గుట్టల్లో పడి నలుగుతోంది!

* * *

హైమావతిని సీటులో చూడగానే శేషగిరి ఎవరెస్టు శిఖరారోహణ చేసినట్లు సంతోషించాడు. జేబు రుమాలుతో చెమట తుడ్చుకుంటూ "నమస్కారమండీ!" అన్నాడు.

సీరియల్ చదువుతున్న 'మూడ్'లో కాస్తంత చిరాకుపడ్డా, వెంటనే రాత్రి గుర్నాధం యిచ్చిన యిన్‌స్ట్రక్షన్స్ గుర్తు కొచ్చాయి హైమావతికి. మొహం ముడిచి ఏమిటన్నట్లుచూపింది. "నేనూ...." అంటూ పరిచయం చేసుకోబోగా "పరిచయాలక్కర్లేదు. పనేమిటో చెప్పండి?" అంది చిరాగ్గానే.

స్కూలు కుర్రాడిలా పనేమిటో చకచకా వప్పచెప్పేశాడు శేషగిరి. ఆమె మౌనంగా, కాస్తంత ప్రసన్నంగా వుండటం చూచి శేషగిరి ఎదిగిపోయాడు.

"చూడమ్మా! పెద్దవుండా కొడుకుని. నువ్వు నాకీ సహాయం చేయాలి. నేనూ గుమాస్తానే. అంచేత చెప్తున్నా. మరోలా అనుకోవద్దు. ఏదో నా సంతోషంకొద్దీ యీ శుభసమయంలో...."

జేబులో చెయ్యిపెట్టిన ధోరణి చూస్తే అక్కడికక్కడే తనకు 'మంత్రపుష్పం' సమర్పిస్తాడేమోనని భయమేసింది హైమావతికి.

"కాలేజీలో గుర్నాధంగారని గుమాస్తాగారు వుంటారు. ఆయన్ని వోసారి కల్సిరండి."

శేషగిరి ఆశ్చర్యపోలేదు. ఆఫీసర్లు కొందరికి ఏజెంట్లు వుండటం ఆయనకి తెలీనిదేంకాదు. అయితే మునిసిపల్ ఆఫీసులోని యీ ఆడ గుమాస్తాకు, కాలేజీలో ఆ గుమాస్తాకు సంబంధమేమిటో అంతుబట్టలేదు. అయినా దాన్ని

గురించి ఆట్టే ఆలోచించే స్వభావం కాదు.

అంచేత "అలాగేనమ్మా!" అని నమస్కరించి, కాలేజీ వైపు సైకిలు మీద పరుగెత్తాడు—తాలూకాఫీసు సీనియర్ గుమాస్తా శేషగిరి!

* * *

గుర్నాధం పర్మిట్ల గుమాస్తా శేషగిరి కోసం తాలూకాఫీసుముందు గంట పడున్నాడు. గుమాస్తా గారు ఎప్పుడొచ్చే వైనం తెలీ లేదు. గంట అయిపోతున్న చివరి క్షణంలో ప్రిన్సిపాలు రాజదండం పట్టుకొని అతని కళ్ళ ముందు ప్రత్యక్షమయ్యాడు. ఎమర్జన్సీలో ప్రజల్లా తాలూకాఫీసు చెట్టుకింద నిలబడ్డాడు.

గంట దాటింది. అయినా తెగించి మరో గంట ఎదురు చూశాడు.

పన్నెండు దాటింది. అధికారుల దాష్టికంలా ఎండ తీవ్రంగా వుంది. కుటుంబ నియంత్రణ డ్రైవ్‌లా వడగాల్పి చంపేస్తున్నది.

ప్రిన్సిపాల్ తనని శంకరగిరి మాన్యాలకు బదిలీ చేయించినట్లు, కాన్ఫిడెన్షియల్ రిపోర్టునిండా తారు పూస్తున్నట్లు గుర్నాధం మనస్సులో వూహా చిత్రాలు గిరగిరా తిరగసాగాయి. భయంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు.

'బతికుంటే బలుసాకు తిన వచ్చు. చక్కెర కంట్రోల్ రేటులో కాకపోతే బ్లాక్‌లో కొను క్కోవచ్చు. అంతగా కాదనుకుంటే రేపు ఎరన్డు లీవు పెట్టి వచ్చి తాడో పేడో తేల్చుకోవచ్చు.'' అని తన నిర్ణయాన్ని బుజ్జగించుకు న్నాడు. ఉస్సురని నిట్టూర్చి సైకి లెక్కి కాలేజీ వైపు తిరోముఖం పట్టేడు.

అదే సమయంలో కాలేజీలో చెట్లను శేషగిరి లెక్కపెట్టి తెక్క పెట్టి విసిగిపోయాడు. గుర్నాధం అనే శాల్తీ, సీటు అనే సింహాస నానికి ఎప్పుడు వేంచేసేదీ ఎవ్వరూ చెప్పలేకపోయారు.

"పర్మిషన్ పెట్టే రండీ. వస్తారు. వెయిట్ చేయండి''

"ఎన్ని గంటల పర్మిషన్? ఎప్పుడొస్తారు?"

చిత్రమేమిటంటే తన అవసరం కొద్దీ శేషగిరి యీ ప్రశ్నలు వేసేడు కాని, తను కనీసం పర్మిషన్ కాగితం అయినా పెట్టలేదని, తన కోసం కూడా యిలాగే ఎవరన్నా ఎదురు చూస్తుండవచ్చునన్న ఆలో చనే శేషగిరికి రాలేదు.

గుర్నాధం సీటుతో పనున్న

విద్యార్థులు గుంపులుగా చేరారు. శేషగిరి ఆ వాతావరణం చూసి నీరసపడిపోయాడు. యివాళ పని కాదు.

ఒకవేళ యిప్పుడు గుర్నాధం వచ్చినా తను మాట్లాడాల్సింది డెలికేట్ విషయమాయె! యీ స్థితిలో మాట్లాడే వీలులేదు. 'రేపు పొద్దున ఫ్రెష్‌గా వున్నప్పుడు తీరిగ్గా పట్టుకోటం నయం' అని నిర్ణయించుకుని నీరసంగా సైకి లెక్కాడు.

శేషగిరి సైకిలు, గుర్నాధం సైకిలు దోవలో వో జంక్షన్ దగ్గర క్షణకాలం కల్సుకుని కుశల ప్రశ్న లేసుకున్నాయి. తమ యజమా నుల్ని చూచి మొదట్లో ఎగతాళిగా తర్వాత జాలిగా నవ్వుకొన్నాయి.

రేపు మళ్ళీ యీ మూడు స్తంభా లాట మొదలు!

* * *

డియర్ రీడర్స్!

యీ కథను యిలా ముగిస్తే మీరూరుకోరు. అలాగని శేషగిరి యిల్లు కట్టేడా? గుర్నాధానికి చక్కెర పర్మిట్టు చిక్కిందా? హైమావతికి పెళ్ళయిందా? అన్న ఉత్కంఠ మీకుందని తాత్పర్యం కాదు.

ఆఫీసు సమయాల్లో వ్యక్తిగత సమస్యల్తో సతమతమవుతూ, ప్రజల్ని యిబ్బంది పెడ్తూ, యీ కథలో లాగా వొక్కోసారి తామే తాము సృష్టించిన యీ యిబ్బందు లకు ఎరలవుతూ వుండే యీ స్థితి మారే దెన్నడు? యీ పరిపాలనా వ్యవస్థలో యీ స్తంభాలాటకు స్వస్తిచెప్పే రోజెప్పుడు వస్తుంది? ముగింపు చెప్పమని నిలేస్తారుమీరు.

నేనేం చెప్పను? అయినా యీ ముగింపు చూడండి.

* * *

శేషగిరి ఆఫీసుకు చేరేసరికి ఆఫీసంతా నిప్పులమీద వున్నట్లు వుంది. కలెక్టరుగారు 'సర్‌ప్రైజ్ చెక్' కు వచ్చారు. (ఇది అవాస్త వికం అంటారా? నిజమే. వాస్త వికం కావాలి).

శేషగిరి ధోరణివల్ల బాధపడ్డ ప్రజలు తిరగబడి కలెక్టరుకు రిపోర్టు యివ్వటంచేత, ప్రత్యక్ష ఆధారం కన్పించగానే అక్కడి కక్కడ సస్పెండ్ చేసి పారేశారు (రూలు వొప్పుకోదు. పిట్టీ)

గుర్నాధం కాలేజీకి చేరేసరికి అతని సీటులో ప్రిన్సిపాల్‌గారు కూర్చొని విద్యార్థుల పనుల్ని చూస్తున్నాడు (అబ్‌సర్డ్ కదూ? ఖర్మ). ఛార్జిసీటు తీసుకొని గుర్నాధం కొందరు లెక్చరర్లని,

పిల్లల్ని కూడగట్టి ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా పిటీషన్లు పైకి పంపేడు. సమ్మెలు చేయించాడు.

ప్రభుత్వం ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయకుండా, ఆయనకు సపోర్టు ఇచ్చింది. కాలేజీలో గుమాస్తాల్లో, లెక్చరర్లలో, విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పింది. (స్వర్ణ యుగం—ఎప్పుడొస్తుందో?)

హైమావతి ఫైలు మధ్య పెట్టుకొని నవల చదువుతుండగానే కమీషనర్ వచ్చి పట్టుకొన్నాడు.

అప్పటికి ప్రజా ప్రతినిధుల్తో మునిసిపాలిటీ వుంది. ఆ ప్రతినిధులకు హైమావతిపైన అభిమానం వున్నా కమీషనరుగారి పాలనా వ్యవహారంలో జోక్యం కలిగించుకోలేదు (వాట్ ఎ వండర్!)

హైమావతే చేసిన తప్పుకు నిజంగా పశ్చాత్తాప పడిపోయి కమీషనర్‌గారి దగ్గర కన్నీరు కారుస్తూ మొరపెట్టుకొంది. కమీషనర్ ఆ ఆడకూతురు కన్నీళ్ళకు మెత్తబడలేదు. ఆమెలో పశ్చాత్తాపంతో కూడిన పరివర్తనకు చలించాడు.

"ఆల్‌రైట్. మరి అతగాడితో చేసుకొన్న వొప్పందాన్నేం చేస్తావు?"

"కేన్సిల్ చేసుకుంటానండీ! అలాగయితేనే అతడిని పెళ్ళిచేసుకొంటానని చెప్పేస్తాను."

"వొప్పుకోకపోతే?"

"అతడిని వదిలేసుకొంటానండీ! యిలాంటి స్థితిలో వుద్యోగాన్ని వదులుకొని జీవితాంతం యీ అపఖ్యాతిని భరించలేను."

"గుడ్. ముందా సమస్య పరిష్కారం చేసుకురా చూద్దాం!"

సస్పెండ్ కాబడ్డ దగ్గరినుంచి గుర్నాధం ప్రభుత్వంమీదే పగబట్టేడు. హైకోర్టులో రిట్ పిటీషన్ వేసి ప్రభుత్వాన్ని సాధించే ప్రయత్నాలలో కోర్టు చుట్టూ తిరుగుతున్నాడని హైమావతికి తెలుసు.

అతడిని వెతుక్కుంటూ హైమావతి కోర్టుకెళ్తే శేషగిరి పట్టుకున్నాడు. అతనూ కోర్టుకెళ్ళే ప్రయత్నంలోనే వున్నాడు.

"ఏం తల్లీ! కొంప కట్టుకోవడం కాదు గాని, నీ దయవల్ల వున్న కొంప కాస్తా కూలింది. గుర్తున్నానా?" అంటూ సంగీతం పాడసాగేడు. సరిగ్గా అప్పుడే గుర్నాధం వచ్చి "ఏమయింది?" అంటూ అడ్డపడ్డాడు.

"నా వుద్యోగం వూడగొట్టింది తల్లి! ఈమె సీటులో నా కాగితాన్ని కదిలించటానికి యీమెగారి చుట్టూ నేను తిరుగుతుంటే కలెక్టరుగారు

నా కొంపకు అగ్గిపెట్టేరు."

"అయితే ఏమంటారు? ఎవరి కర్మకెవరు బాధ్యులు?" అని సర్ది చెప్తున్నంతలోనే అతనికి తన స్థితి గుర్తుకొచ్చింది. "తాలూకా ఆఫీసులో చక్కెర పర్మిట్ల గుమాస్తా వెధవ కన్పిస్తే పొడిచిపారెయ్యాలనివుంది నాకు. కన్పిస్తే చెప్పండి, నా కళ్ళబడవద్దని. రాస్కెల్ ఎన్ని సార్లెళ్ళినా సీటులో చచ్చేడు కాదు. అదను చూచి మా ప్రిన్సిపాల్ ముండాకొడుకు నన్ను మింగేశాడు."

శేషగిరి తగ్గేడు. అయితే అంతలోనే అనుమానం వచ్చి కోపంతో వొళ్ళంతా వొణికిపోయింది.

"కొంప దీపి గుర్నాధంగారు తమరేనా ఏంటి?"

"అయితే?"

అమాంతం అతని చొక్కా పట్టుకున్నాడు శేషగిరి.

"తాలూకాఫీసు చక్కెర పర్మిట్ల గుమాస్తాను హత్య చేస్తానన్నావు. యిప్పుడు నిన్నేం చేయమంటావో చెప్పు?"

"అసలు మీ రెవరో చెప్పకుండా ఏమిటండీ?"

"మీకోసం కాలేజీలో వో పూటల్లా పడిగాపులు కాసి వుద్యోగం వూడగొట్టుకొన్న ఆ తాలూకాఫీసు చక్కెర పర్మిట్ల గుమస్తా శేషగిరిరావును నేనే."

గుర్నాధం తల గిర్రున తిరిగింది ముందు. ఆ తర్వాత జోరుగా పనిచేయసాగింది. కోర్టుకు పోవటానికి గొప్ప తోడు.

అమాంతం శేషగిరిని కౌగిలించేసుకొని హాయిగా నవ్వేడు.

"నీ వల్ల నేను, నావల్ల నువ్వు వుద్యోగాలు పోగొట్టుకొన్నామన్న మాట! వండ్రపుల్. కానీ దోస్త్ యిప్పుడు యిద్దరం కల్సి కోర్టుకెళ్ళి తిరిగి వుద్యోగాలు సంపాదించుకొంటే అంతకన్నా వండ్రపుల్గా వుంటుంది. ఏమంటావ్?"

శేషగిరి గుర్నాధం చొక్కా వదిలి చెయ్యి పట్టుకున్నాడు.

"హైమా కూడా త్వ ర లో మనల్ని క ల స్తుం ది. వాట్ డియర్?"

హైమావతి యిద్దరివైపు వో క్షణం చూచి 'ఛా' అని అసహ్యంగా వుమ్మేసి విస విసా నడిచిపోయింది!

మూడు స్తంభాలాటకు స్వస్తి! మూల సమస్యకు పరిష్కార ప్రారంభం (ఎప్పుడో?)!! *